

బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,150
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.72

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	34	16
తిరుపతి	33	18
తిరుమల	29	13
గూడూరు	34	19
నగరి	34	17

రూ.250 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి



రాష్ట్రంలో పేద పిల్లల ప్రాణాలు కాపాడడానికి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రూ.250 కోట్లతో నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ...8లో

న్యూస్‌రీల్

స్పందన వినతులకు అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

చిత్తూరు కలెక్టరేట్ : స్పందన వినతుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యమివ్వాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న అర్జీలను త్వరతిగతిన పరిష్కరించాలన్నారు. విద్యార్థులకు ఇవ్వాల్సిన ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాల విచారణ పూర్తి చేసి మంజూరుచేయాలని సూచించారు. ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఫేస్ అటెండెన్స్ వేయాలని చెప్పారు. జిల్లాలో రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. హౌసింగ్‌కు సంబంధించి నిర్దేశిత లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. పోలింగ్ కోసం బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేసుకోవాలని, నోడల్ అధికారులు కేటాయించిన విధులను బాధ్యతాయుతంగా నిర్వర్తించాలని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ వెంకటేశ్వర్, డీఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీఆర్‌డీఏ, డ్వామా, హౌసింగ్ పీడీలు తులసి, గంగా భవానీ, పద్మనాభం, డీపీఓ లక్ష్మి పాల్గొన్నారు.

పకడ్బందీగా పంట నమోదు



వరి పైరును పరిశీలిస్తున్న హబీబ్‌బాషా

బంగారుపాళెం : ప్రభుత్వ పథకాలు సక్రమంగా రైతులకు అందించేందుకు పకడ్బందీగా పంట నమోదు పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని మహాసముద్రం, చీకూరుపల్లె, నలగాంపల్లె, తిమ్మోజుపల్లె రైతుభరోసా కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ–క్రాప్, పీఎం కిసాన్ ఈకేవైసీ వివరాలు, కియోస్కోల పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులతో ఎప్పటికప్పుడు సమావేశమై పంట సాగులో తీసుకోవాల్సి జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించాలని కోరారు. అనంతరం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఏఓ పద్మజ, విస్తరణాధికారి సాధరయ్య పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



ఏనుగులు తొక్కేసిన వరి పంట

పెద్దపంజాణి : మండలంలోని పెద్దకాప్పల్లెలో మంగళవారం రాత్రి పలు పంటలను ఏనుగులు ధ్వంసం చేశాయి. జయారెడ్డి, రమణారెడ్డి, నాగరాజారెడ్డి, నారాయణరెడ్డి, సుభాషణరెడ్డి , పెనుగొలకల రామకృష్ణ, ముదిరెడ్డిపల్లె నారాయణకు చెందిన వరి పంటను నాశనం చేశాయి. మామిడి, అరటి చెట్లను విరిచేశాయి. చింతకాయలను తినేశాయి. ఏనుగుల దాడిలో సుమారు రూ.లక్ష నష్టవాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపారు. రాయలపేట, చారాల బీట్ అధికారులు రవికుమార్, దొరస్వామి గ్రామానికి చేరుకుని ట్రాకర్ల సాయంతో ఏనుగులను కీలపట్ల అటవీ ప్రాంతంలోకి మళ్లించారు. పంటలు నష్టపోయిన వారి వివరాలను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు వెల్లడించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు హెల్ప్ డెస్క్



కాల్‌సెంటర్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని డెస్కును డీఆర్‌ఓ రాజశేఖర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల పూర్తయ్యే వరకు 24 గంటల పాటు హెల్ప్ డెస్క్ పనిచేస్తుందన్నారు. ఏమైనా ఫిర్యాదులుంటే 08472–242777 నంబర్‌కు తెలియజేయవచ్చని సూచించారు.



సహకార సంఘ భవనంలో బంతి పూలమాలలు కడుతున్న మహిళలు



మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధమవుతున్న టమాట

మూడు పువ్వులు.. ఆరు కాయగూరలు

- ఆదర్శవంతంగా కుప్పం ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల సంఘం
- 15 మందితో మొదలై.. 300 మంది సభ్యులతో ముందడుగు
- ప్రభుత్వ ప్రోత్సాహాన్ని అందిపుచ్చుకుంటూ అభివృద్ధి
- దళారులతో పనిలేకుండా నేరుగా మార్కెటింగ్
- పారదర్శకంగా రైతులకు లాభాల పంపిణీ

ఐకమత్యమే మహాబలమని నిరూపిస్తున్నారు కుప్పం రైతులు.. సమష్టిగా పని చేస్తే సాధించలేదని లేదని రుజువుచేస్తున్నారు. ఓ సంఘంగా ఏర్పడి పరస్పరం సహకరించుకుంటూ లాభాలను ఆర్జిస్తున్నారు. మరికొందరికి ఉపాధి కల్పిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఏటా పంట ఉత్పత్తులను గణనీయంగా పెంచుకుంటూ ఆదాయమార్గాన పయనిస్తున్నారు. దళారులతో పనిలేకుండా పక్కాగా మార్కెటింగ్ చేస్తూ గ్రూపు సభ్యులకు గిట్టుబాటు ధర అందేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పారదర్శంగా లావాదేవీలను నిర్వహిస్తూ అధికారుల ప్రశంసలు అందుకుంటున్నారు. 15మందితో సహకారం సంఘాన్ని ప్రారంభించి అనతికాలంలోనే 300 మంది సభ్యులతో సత్తా చాటుతున్నారు.

కుప్పంరూరల్ : మండలంలోని కమతమూరులో కుప్పం ఉద్యాన రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ప్రారంభమైంది. 2021 జూన్‌లో కేవలం 15 మందితో మొదలైన ఈ సంఘం ప్రస్తుతం 300 మంది సభ్యులతో విజయవంతంగా నడుస్తూ జిల్లాలోనే తొలిస్థానంలో నిలిచింది. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుంటూ పంట ఉత్పత్తులను పెంచుకుంటోంది.

మహిళలకు ఉపాధి

సహకార సంఘం తరఫున ముఖ్యంగా పువ్వులు, కూరగాయల సాగును ప్రోత్సహిస్తున్నారు. మార్కెట్ అవసరాల మేరకు ఇక్కడే బంతి, చామంతి, కనకాంబరం, కాగడా పువ్వులను కట్టించి మరీ విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో పలువురు మహిళలకు సహకారం సంఘంలో దినసరి కూలీలుగా ఉపాధి లభిస్తోంది.

450 టన్నుల ఉత్పత్తి

కుప్పం ఉద్యాన రైతుల సహకార సంఘం ద్వారా అనతికాంలో 450 టన్నుల పువ్వులు, కూరగాయలను ఉత్పత్తి చేస్తుండడం విశేషం. సంఘం ప్రారంభించిన తొలి ఏడాది 100 టన్నుల పువ్వులు, 50 టన్నుల కూరగాయలను ఉత్పత్తి చేయగా, రెండో ఏట నుంచి 200 టన్నుల పువ్వులు, 100 టన్నుల కూరగాయలను మార్కెటింగ్ చేస్తున్నారు.

రిలయన్స్, డీమార్ట్‌తో చర్చలు

చెన్నైలోని రిలయన్స్, డీమార్ట్ మాల్స్‌కు కూరగాయలను సరఫరా చేసేందుకు సహకారం సంఘం వారు చర్చలు జరుపుతున్నారు. రోజూ టమాట, బంగాళాదుంప, మిరప, బీన్స్, వంకాయ, బెండకాయలను అందించే దిశగా ఒప్పందం కుదుర్చుకునేందుకు అడుగులు వేస్తున్నారు. ఈ చర్చలు ఫలిస్తే రైతులకు మరింత మేలు చేకూరే అవకాశముందని ఉద్యానశాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇందుకు తమ వంతు సహకారం అందిస్తున్నట్లు వివరిస్తున్నారు.



పూల ఉత్పత్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

ప్రభుత్వ ప్రోత్సాహం

సహకార సంఘానికి ఉద్యానశాఖ ఎంఐడీహెచ్ ద్వారా రూ.6 లక్షలు, ఆర్‌కేవీవై కింద రూ.5 లక్షల విలువైన సామగ్రిని అందించింది. ఈ క్రమంలోనే ఇటీవల సంఘం పనితీరును పరిశీలించిన కలెక్టర్ హరినారాయణన్ అభినందనలు తెలిపారు. సంఘం అభివృద్ధికి మరింత సాయం అందిస్తామని భరోసా కల్పించారు. అలాగే ఒక ఐషర్ లారీ, కోల్డ్ స్టోరేజీ ప్లాంట్ నిర్మాణానికి రాయితీపై నిధులు మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

పారదర్శకం.. ఆదర్శవంతం

సహకారం సంఘంలో ఎవరైనా రైతు సభ్యుడిగా చేరాలంటే రూ.100 చెల్లించాల్సి ఉంటుంది. సభ్యత్వం ఉన్న రైతులకు వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పుడు ఏయే పంటలు సాగు చేయాలో తెలియజేస్తారు. మార్కెట్‌లో ప్రస్తుతం ఏ పంటకు మంచి ధర పలుకుతోందో కూడా వెల్లడిస్తారు. అందుకు తగ్గట్టుగానే రైతులకు విత్తనాలు కూడా సరఫరా చేస్తారు. అక్కడి నుంచి ఎరువుల వాడకం, సాగులో కొత్త పద్ధతులపై ఉద్యానశాఖ అధికారులతో పద్ధతులపై ఉద్యానశాఖ అధికారులతో అవగాహన కల్పిస్తారు. దిగుబడి వచ్చిన తర్వాత పంటను సహకార సంఘం భవనానికి చేరుస్తారు. ఆన్‌లైన్ ద్వారా ఏ మార్కెట్‌లో పంటకు గిట్టుబాటు దక్కుతోందో తెలుసుకుని అక్కడకి తరలించి విక్రయిస్తారు. వచ్చిన డబ్బులను రైతులకు పంచిపెడతారు. ఇందులో ఎలాంటి కమీషన్లు ఉండవు. ఈ ప్రక్రియ లాభసాటిగా ఉండడంతో పెద్దసంఖ్యలో రైతులు సహకారం సంఘంలో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు.

శ్రమ తగ్గింది



రైతు ఉత్పత్తిదారుల సంఘంలో చేరడం ద్వారా చాలా మేలు జరుగుతోంది. విత్తనాలు సరఫరా, సాగు విధానం, ఎరువుల వాడకంపై ఎప్పటికప్పుడు సలహాలు అందిస్తుండడంతో సేద్యం సులువుగా మారింది. మార్కెట్‌కు పంట తరలించేందుకు సంఘం వారే లారీలో తీసుకెళుతున్నారు. మంచి ధర కోసం చెన్నై, బెంగళూరుకు కూడా తరలిస్తున్నారు. దీంతో మాకు చాలా శ్రమ తగ్గింది.

– మల్లికార్జున్, రైతు, సింగసముద్రం

సంతోషంగా ఉంది



నేను ఎంబీఏ చదువుకున్నా. స్థానిక రైతులకు ఏదైనా మంచి చేయాలనే లక్ష్యంతో ఈ సంఘాన్ని 2021లో ప్రారంభించాం. మా పనితీరు నచ్చడంతో 300 మంది సభ్యులుగా చేరారు. మరింత మంది చేరేందుకు సంప్రదిస్తున్నారు. పారదర్శకంగా లావాదేవీలు నడుపుతుండడంతో రైతులకు పక్కాగా లాభాలు అందిస్తున్నాం. ప్రస్తుతం జిల్లాలోనే మా సంఘం తొలి స్థానంలో నిలవడం సంతోషంగా ఉంది.

– శరవణ, సహకారం సంఘం అధ్యక్షుడు, కత్తిమానుపల్లె

ఎప్పటికప్పుడు సూచనలు



కుప్పం ఉద్యాన రైతు ఉత్పత్తి సంఘం సభ్యులకు ఎప్పటికిప్పుడు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. అలాగే కుప్పం సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో రైతులను బృందాలుగా పిలిపించుకుని శాస్త్రవేత్తలతో శిక్షణ ఇప్పిస్తున్నాం. ఇది రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోంది. అంతే కాకుండా ఇక్కడ అంటు కట్టిన మొక్కలు సరఫరా చేస్తుండడంతో దిగుబడి కూడా పెరిగింది.

– దింపుప్రియ, ఉద్యానశాఖాధికారి, కుప్పం

నిబంధనల మేరకే నామినేషన్లు

- నేడే ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్

సాక్షి, చిత్తూరు : ఎమ్మెల్సీ అభ్యర్థులు నిబంధనల మేరకే నామినేషన్ దాఖలు చేయాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఉమ్మడి ప్రకాశం, పొట్టిశ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాల ఉపాధ్యాయ, పట్టభద్రులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థులు చిత్తూరు కలెక్టరేట్‌లో నామినేషన్‌లు దాఖలు చేసేందుకు వీలుగా సర్వం సిద్ధం చేశారు. ఎన్నికల ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరినారాయణన్, స్థానిక సంస్థల ఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ నిరంతరం ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

23 వరకు నామినేషన్ల స్వీకరణ

ఎన్నికల కమిషన్ జారీచేసిన షెడ్యూల్ ప్రకారం ఈ నెల 23వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ విడుదల చేసిన రోజు నుంచే అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయవచ్చని బుధవారం కలెక్టరేట్ అధికారులు వెల్లడించారు. 16 నుంచి 23వ తేదీ వరకు రోజూ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపే నామినేషన్ దాఖలు చేయాలని సూచించారు. నామినేషన్ సమయంలో ఎలాంటి ఘటనలు జరగకుండాపోలీసు బందోబస్తుతో పాటు, వీడియో కవరేజ్‌ను ఏర్పాటు చేయించామన్నారు. ఈ నెల 24వ తేదీన నామినేషన్ల పరిశీలన, 27 వరకు ఉపసంహరణకు అవకాశం కల్పించినట్లు వివరించారు.



నేడు 'ప్రతిబింబాలు' శతదినోత్సవం

తవణంపల్లె : మండలంలోని అరగొండ కృష్ణ థియేటర్‌లో గురువారం ఉదయం 10.30 గంటలకు అక్కినేని నాగేశ్వరరావు నటించిన ప్రతిబింబాలు సినిమా 100 రోజులు ప్రదర్శించిన సందర్భంగా శతదినోత్సవ వేడుకలు నిర్వహించనున్నారు. బుధవారం ఈమేరకు థియేటర్ యజమాని జొన్నగురకల రమాకాంత రెడ్డి మాట్లాడుతూ 1982లో అక్కినేని నాగేశ్వరరావు, జయసుధ, తులసి నటించిన ప్రతిబింబాలు సినిమా సాంకేతిక కారణాలతో విడుదల కాలేదన్నారు. అయితే గత ఏడాది సినిమాను డిజిటల్ ఫార్మట్ చేసి నవంబర్ 5వ తేదీన కృష్ణ థియేటర్‌లో మాత్రమే విడుదల చేసినట్లు వెల్లడించారు. నేటితో చిత్రం వందరోజుల ప్రదర్శన పూర్తి చేసుకుందని, ఇందుకు సహకరించిన ఏఎన్ఆర్ అభిమానుల సమక్షంలో వంద రోజుల ఫంక్షన్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.



ప్రతిబింబాలు సినిమా పోస్టర్

క్రైస్తవ సంఘాల అభివృద్ధికి కృషి



పాస్టర్లకు సరుకులు పంపిణీ చేస్తున్న థియోస్టీఫెన్

తవణంపల్లె : క్రైస్తవ సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక ఆర్గనైజర్ థియోస్టీఫెన్ తెలిపారు. బుధవారం మండలంలోని జీఎఫ్ఐ చర్చిలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. థియోస్టీఫెన్ మాట్లాడుతూ పాస్టర్ల సంక్షేమానికి చేయూతనందిస్తామన్నారు. అనంతరం పాస్టర్లకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రీడ్స్‌సంస్థ ఎస్సీ, ఎస్టీ జిల్లా కో–ఆర్డినేటర్ కోదండపాణి, పాస్టర్ సైలస్ పాల్గొన్నారు.

కలెక్టర్‌తో కేంద్ర జలశక్తి శాఖ సభ్యుల భేటీ

చిత్తూరు కలెక్టరేట్ : కేంద్ర జలశక్తి శాఖ సభ్యులు సుమన్, లక్ష్మీనారాయణ బుధవారం క్యాంప్ కార్యాలయంలో కలెక్టర్ హరినారాయణన్‌తో భేటీ అయ్యారు. జిల్లా పర్యటించాల్సిన ప్రాంతాలు, ఇతర వివరాలపై చర్చించారు. ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో సోమల మండలం వల్లిగట్ల అత్యుత్తమ ఫలితాలు సాధించడం అభినందనీయమన్నారు.

డార్క్ ఏరియాలు ఎత్తివేత

చిత్తూరు అగ్రికల్చర్: కుప్పం నియోజకవర్గ పరిధిలోని డార్క్ ఏరియాలను ఎత్తివేస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. గతంలో గుడిపల్లె మండలం జరుగుకొండ, సంగనపల్లె, సొడిగానిపల్లె, కుప్పం మండలంలోని ఎలజానురు, కుప్పం, కమతమూరు రెవెన్యూ పరిధిలో భూగర్భ జలాలు అడుగంటడంతో వాల్టా చట్టం ప్రకారం ఆ ప్రాంతాలను డార్క్ ఏరియాలుగా ప్రకటించారు. అప్పటి నుంచి అక్కడ బోర్లు వేయడం, మోటార్లకు కొత్తగా విద్యుత్ కనెక్షన్ ఇవ్వడంపై నిషేధం విధించారు. అయితే రెండేళ్లగా వర్షాలు సమృద్ధిగా కురుస్తూ భూగర్భ జలాలు పెరగడంతో ప్రభుత్వం స్పందించి నిషేధం తొలగించింది.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

- డీఈఓ విజయేంద్రరావు
- ఒక టీచర్ సస్పెన్షన్.. ఇద్దరికి నోటీసులు

చిత్తూరు కలెక్టరేట్ : విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని డీఈఓ విజయేంద్రరావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ తవణంపల్లె మండలంలోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మల్లంకుంట ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ రాజేష్‌కుమార్ తరచూ విధులకు గైర్హాజరవడం, పాఠాలు సక్రమంగా బోధించకపోవడంతో సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. కృష్ణాపురం జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయని సుహాసిని, ప్రాథమిక పాఠశాల ఎస్జీటీ రఘుపతిరెడ్డి బాధ్యతగా విధులు నిర్వర్తించకపోవడంతో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు వివరించారు.

బిల్లులు అందించకుంటే చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రచార పోస్టర్లు, కరపత్రాలను ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు సక్రమంగా బిల్లులు అందించకుంటే కఠిన చర్యలు తప్పవని డీఆర్‌ఓ రాజశేఖర్ హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో కో–ఆపరేటివ్, ప్రైవేట్ ప్రింటింగ్ ప్రెస్ యజమానులతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చులకు సంబంధించి ఎలాంటి లిమిట్స్ లేవన్నారు. ఈక్రమంలో ప్రింటింగ్ ప్రెస్ యజమానులు రోజువారీగా అభ్యర్థుల కోసం ముద్రించిన ప్రచార పత్రాలకు అయిన బిల్లుల కాపీలను కలెక్టర్ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. పోస్టర్లు, కరపత్రాలపై ప్రింటింగ్ ప్రెస్ వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. సకాలంలో బిల్లులు అందించని వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అభ్యర్థులు అందజేసిన బిల్లులతో వీటిని సరిచూసి ఆడిట్ చేసిన తర్వాత ఎన్నికల సంఘానికి పంపుతామని వెల్లడించారు. సమావేశంలో జిల్లా ఆడిట్ అధికారి రంగయ్య, కలెక్టరేట్ సూపరింటెండెంట్ వాసుదేవన్, డీటీ మధు పాల్గొన్నారు.

‘ఎస్పీఎల్’ విజేత తిరుపతి

- జూనియర్ విభాగంలో ఇడుపులపాయ జట్టు
- అట్టహాసంగా ముగిసిన సాక్షి ప్రీమియర్ లీగ్ రీజనల్ స్థాయి క్రికెట్ పోటీలు

అనంతపురం సప్తగిరి సర్కిల్ : ‘సాక్షి ప్రీమియర్ లీగ్’ రీజనల్ స్థాయి సీనియర్ విభాగం క్రికెట్ పోటీల విజేతగా తిరుపతి సీకాం జట్టు, జూనియర్స్ విభాగంలో వైఎస్సార్ జిల్లా ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ జట్టు నిలిచాయి. ‘సాక్షి’ మీడియా గ్రూపు ఆధ్వర్యంలో అనంత క్రీడాగ్రామం వేదికగా రెండు రోజుల పాటు సాగిన ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీలు ఆద్యంతం ఉత్కంఠగా సాగాయి. బుధవారం ఆర్డీటీ ప్రధాన స్టేడియంలో నిర్వహించిన ఫైనల్స్‌లో సీనియర్ విభాగంలో సీకాం జట్టు (తిరుపతి) ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు (ప్రొద్దుటూరు), జూనియర్ విభాగంలో ట్రిపుల్ ఐటీ (వైఎస్సార్), సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్లు తలపడ్డాయి.

ధరణి మెరుపు బ్యాటింగ్

- సీనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం డిగ్రీ కళాశాల (తిరుపతి) జట్టుపై ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాల (ప్రొద్దుటూరు - వైఎస్సార్ జిల్లా) జట్టు టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 79 పరుగులకు పరిమితమైంది. జట్టులో విజయ్ 25 బంతుల్లో 2 ఫోర్లతో 30 పరుగులు, మరో బ్యాటర్ శివకేశవ 16 బంతుల్లో 1 సిక్సర్‌తో 20 పరుగులు సాధించారు. సీకాం బౌలర్లలో శశాంక్ 2, సుబ్బు 1 వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన సీకాం జట్టు 7.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని సునాయసంగా ఛేదించింది. ధరణి మెరుపు బ్యాటింగ్‌తో జట్టును విజయతీరాలకు చేర్చాడు. మొత్తం 23 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్సర్లతో 52 పరుగులు సాధించాడు. ఎస్‌కేఎస్‌సీ బౌలర్లలో వెంకటేష్ 1 వికెట్ దక్కించుకున్నాడు. 8 వికెట్ల తేడాతో తిరుపతి సీకాం జట్టు విజయ కేతనం ఎగురవేసి, త్వరలో విజయవాడ వేదికగా సాగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.

రీజనల్ స్థాయి మ్యాచ్‌లో చెలరేగిన ట్రిపుల్ ఐటీ

- అనంత క్రీడాగ్రామంలోని హాకీ మైదానం వేదికగా బుధవారం ఉదయం నిర్వహించిన జూనియర్స్ విభాగం రీజనల్ మ్యాచ్‌లో ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా), ప్రభుత్వ జూనియర్ కళాశాల (ఆత్మకూరు - అనంతపురం జిల్లా) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి ఆత్మకూరు జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇడుపులపాయ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 141 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. జట్టులో చేతన్ 23 బంతుల్లో 7 ఫోర్లు, 4 సిక్సర్లతో 60 పరుగులు, రాంబాబు 25 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 48 పరుగులు సాధించారు. ఆత్మకూరు బౌలర్లలో మనోజ్, జయ చెరో వికెట్ పడగొట్టారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు జట్టు 9.4 ఓవర్ల వద్ద 60 పరుగులకే కుప్పకూలింది. జట్టులో వెంకట్ ఒంటరి పోరు సాగిస్తూ 12 బంతుల్లో 6 ఫోర్లతో 25 పరుగులు సాధించాడు. ఇడుపులపాయ బౌలర్లలో ప్రకాష్, హర్ష, చరణ్ చెరో 2 వికెట్లు కూలదోశారు. 81 పరుగులతో ఇడుపులపాయ జట్టు భారీ విజయాన్ని నమోదు చేసి ఫైనల్‌కు చేరుకుంది.

ఉత్కంఠ రేపిన ‘జూనియర్స్’

- ఆర్డీటీ ప్రధాన క్రీడామైదానంలో నిర్వహించిన జూనియర్ విభాగం ఫైనల్స్‌లో సీకాం జూనియర్ కళాశాల (తిరుపతి) జట్టుపై టాస్ గెలిచి ట్రిపుల్ ఐటీ (ఇడుపులపాయ - వైఎస్సార్ జిల్లా) జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 82 పరుగులు చేసింది. జట్టులో ప్రకాష్ 12 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్సర్లతో 34 పరుగులు, మరో బ్యాటర్ రాంబాబు 25 బంతుల్లో 1 ఫోర్, 2 సిక్సర్లతో 26 పరుగులు సాధించారు. తిరుపతి బౌలర్లలో గౌతం 3, ముఖేష్ 2 వికెట్లు కూలదోశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన తిరుపతి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 81 పరుగులు చేసింది. చివరి ఆరు బంతుల్లో 20 పరుగులు సాధించాల్సి ఉండగా క్రీజ్‌లో హర్ష, బాలాజీ ఉన్నారు. తొలి బంతిని బ్యాటర్ బౌండరీ దాటించడంతో ట్రిపుల్ ఐటీ క్రీడాకారులు ఒత్తిడికి లోనయ్యారు. ఈ క్రమంలో రెండో బంతిని బౌలర్ డాట్ చేశాడు. మూడో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో తిరిగి ఉత్కంఠ నెలకొంది. ఇక మిగిలిన మూడు బంతుల్లో పది పరుగులు సాధించాల్సి ఉండడంతో ఇరు జట్ల క్రీడాకారులతో పాటు చూస్తున్నప్రేక్షకులు సైతం ఊపిరిబిగబట్టారు. నాలుగో బంతిని బౌలర్ వైడ్ వేయడంతో తిరుపతి క్రీడాకారుల్లో ఆశలు చిగురించాయి. ఐదో బంతికి బ్యాటర్ సింగిల్ రన్ చేశాడు. మిగిలిన చివరి రెండు బంతుల్లో ఎనిమిది పరుగులు సాధించాల్సి ఉంది. ఆరో బంతిని బ్యాటర్ సిక్సర్ బాదడంతో ఒక్కసారిగా తిరుపతి క్రీడాకారులు కేరింతలు కొట్టారు. విజయం తమదేనన్న ధీమా అందరిలోనూ వ్యక్తమైంది. అయితే ట్రిపుల్ ఐటీ బౌలర్ ఏడో బంతిని చాకచక్యంగా డాట్ చేయడంతో ఊహించని విధంగా విజయం ట్రిపుల్ ఐటీ వశమైంది. ఒక్క పరుగు తేడాతో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించింది.



సీనియర్ విభాగంలో విన్నర్స్ తిరుపతి సీకాం డిగ్రీ కళాశాల జట్టుకు ట్రోఫీ అందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ

ఓటమి గెలుపునకు తొలిమెట్టు

ఏ క్రీడలోనైనా ఓటమి అనేది తర్వాత సాధించే గెలుపునకు తొలి మెట్టుగా ఉపయోగపడుతుందని జేఎన్‌టీయూ (ఏ) వీసీ జింక రంగజనార్దన అన్నారు. ఎస్పీఎల్ రీజనల్ స్థాయి పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరై, మాట్లాడారు. గెలుపు ఆనందాన్ని అందిస్తే ఓటమి భవిష్యత్తుపై ఆశలు రేపుతుందన్నారు. ప్రతి క్రీడాకారుడు గెలుపోటములను సమానంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ చక్కటి అవకాశాన్ని ఇచ్చిన ‘సాక్షి’ మీడియా గ్రూపును అభినందించారు. రైపర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ రవీంద్రారెడ్డి మాట్లాడుతూ.. ఓటమి గెలుపునకు నాంది అవుతుందని, ఎన్నో సవాళ్లను ఎదుర్కొనేందుకు తొలి మెట్టుగా దోహదపడుతుందని అన్నారు. రాయలసీమ స్థాయి టోర్నీ నిర్వహణకు సహకరించిన ఆర్డీటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం విజేతలకు ట్రోఫీలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ‘సాక్షి’ అనంతపురం బ్రాంచ్ మేనేజర్ శ్రీకాంత్, ఏడీవీటీ అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు, ఈవెంట్ మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జూనియర్ విభాగంలో విన్నర్స్ ట్రిపుల్ ఐటీ జట్టు



సీనియర్ విభాగంలో రన్నర్స్ ఎస్‌ఆర్‌ఎస్‌సీ డిగ్రీ కళాశాల జట్టు



జూనియర్ విభాగంలో రన్నర్స్ తిరుపతి సీకాం జూనియర్ కళాశాల జట్టు

రూ.250 కోట్లతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి

- వీలైనంత త్వరగా చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం
- గుండె మార్పిడి చేయించుకున్న విశ్వేశ్వర్‌కు టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పరామర్శ



మీడియాతో మాట్లాడుతున్న టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, పక్కన టీటీడీ జేఈఓ సదాభార్గవి, వైద్యులు

తిరుపతి తుడా : రాష్ట్రంలో పేద పిల్లల ప్రాణాలు కాపాడడానికి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆశీస్సులతో రూ.250 కోట్లతో నిర్మిస్తున్న చిన్న పిల్లల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామని టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. ఈ ఆస్పత్రిలో అవయవ మార్పిడికి అవసరమైన అన్ని సదుపాయాలతో పాటు హెలిప్యాడ్ కూడా నిర్మిస్తామని తెలిపారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయంలో జనవరి 20వ తేదీ రాష్ట్రంలోనే తొలి చిన్న పిల్లల గుండె మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించిన విషయం తెలిసిందే. బుధవారం సాయంత్రం టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి జేఈఓ సదాభార్గవితో కలసి ఆస్పత్రిలో గుండెమార్పిడి చేసుకున్న విశ్వేశ్వర్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 2021 అక్టోబర్ 11వ తేదీన శ్రీ పద్మావతి చిన్న పిల్లల హృదయాలయాన్ని ప్రారంభించామన్నారు. ఇక్కడ కేవలం 15 నెలల కాలంలోనే 1,110 మంది చిన్న పిల్లలకు గుండె శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు సుబ్బారెడ్డి చెప్పారు. గుండె మార్పిడి చికిత్సను విజయవంతం అయ్యేలా కృషి చేసిన అందరినీ ఆయన అభినందించారు. కార్యక్రమంలో బర్డ్ ఆస్పత్రి ప్రత్యేకాధికారి డాక్టర్ రెడ్డెప్ప రెడ్డి, చిన్నపిల్లల గుండె ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ భరత్, ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఆక్వా అభివృద్ధికి కృషి చేయండి

– ఆక్వా జోన్ ఏర్పాటుకు కమిటీ ఆమోదం




ఆక్వాజోన్ ఏర్పాటుపై చర్చిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: జిల్లాలో ఆక్వా అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఆక్వా జోన్ కమిటీ సమావేశంలో ఆక్వాజోన్ ఏర్పాటుకు ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల పునర్విభజన మేరకు తిరుపతి జిల్లాకు సముద్రతీరం వచ్చిందన్నారు. తీరప్రాంతంలో ఆక్వా సాగు ఉందని గుర్తు చేశారు. ఆక్వా రైతులను జోన్ పరిధిలోకి తీసుకురావాలని చెప్పారు. ఏ భూముల్లో ఆక్వా సాగు చేస్తున్నారు ? ఆ భూములు సక్రమంగా ఉన్నాయా ? లేదా అనేవాటిపై పూర్తి వివరాలతో సమాచారం సేకరించాలని చెప్పారు. ఆక్వా అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న విద్యుత్ రాయితీలతో పాటు దాణా తదితర అంశాలపై చర్చించారు. జిల్లా మత్స్యశాఖ అధికారి చాంద్ బాషా మాట్లాడుతూ జిల్లాలో ప్రధానంగా చిట్టమూరు, చిల్లకూరు, వాకాడు, కోట మండలాల్లో కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నిబంధనల మేరకు సర్వే చేశామని తెలిపారు. ఈ మండలాల్లో ఆక్వా సాగు 2019 నాటికి 2381.67 హెక్టార్లు ఉండగా, రీసర్వేలో 27 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి అదనంగా 782.39 హెక్టార్లు ఆక్వా సాగులో ఉందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆక్వాకమిటీ సభ్యులు జ్ఞానవేల్, అరవిక్కరసు, నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే శివదీక్ష స్వీకరణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి శివదీక్ష స్వీకరించనున్నారు. దీక్ష మాల ధరించనున్న భక్తులు ఉదయం 6 గంటలకు ఆలయ పరిసరాల్లోని త్రినేత్ర అతిథిగృహం వద్దకు చేరుకోవాలని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి వెలువడిన ప్రకటనలో పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో పుంగనూరు వాసి మృతి



చాంద్‌బాషా (ఫైల్)

పుంగనూరు : తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో పుంగనూరు వాసి మృతి చెందాడు. వివరాలు.. పట్టణంలోని దోబీ కాలనీకి చెందిన వలీబాషా కుమారుడు చాంద్‌బాషా(22) మినీ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఆవులను తీసుకుని వస్తూ టైర్లలో గాలి చెక్ చేసుకునేందుకు రోడ్డు పక్కన ఆపాడు. ఇంతలో వెనుక నుంచి సిమెంట్‌లోడ్‌తో వస్తున్న లారీ వేగంగా ఢీకొంది. దీంతో చాంద్‌బాషా అక్కడికక్కడే మరణించాడు. కుటుంబాన్ని పోషించే కొడుకు కన్నుమూయడంతో తల్లిదండ్రులు, సోదరి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు వలంటీర్ మృతి

నదుం : మండలంలోని చింతలవారిపల్లెకు చెందిన గ్రామ వలంటీర్ రాజశేఖర్(30) బుధవారం ప్రమాదవశాత్తు మృతి చెందాడు. వివరాలు.. రాజశేఖర్ మట్టి తోలేందుకు ట్రాక్టర్ తీసుకుని వెళ్లాడు. బురకాయలగుట్ట వద్ద మట్టి తీసే జేసీబీ మరమ్మతులకు గురికావడంతో, ఆపరేటరు గంగాధర్‌తో కలిసి రిపేరు చేస్తుండగా గుట్టపై నుంచి బండరాయి జారి మీద పడింది. దీంతో అక్కడికక్కడే మరణించారుడ. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. భార్య చైతన్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

ఆంధ్రజ్యోతిపై పరువు నష్టం దావా మార్చి 15కు వాయిదా

తిరుపతి లీగల్: ఆంధ్రజ్యోతి పత్రికపై టీటీడీ దాఖలు చేసిన రూ.100 కోట్ల పరువు నష్టం దావాను తిరుపతి పదవ అదనపు జిల్లా జడ్జి కోర్ట్ ఇన్‌చార్జి న్యాయమూర్తి, స్థానిక ఐదవ అదనపు జిల్లా జడ్జి అన్వర్‌బాష మార్చి 15కి వాయిదా వేశారు. బుధవారం టీటీడీ ఇదివరలో దాఖలు చేసిన 2 పిటిషన్లపై ఆంధ్రజ్యోతి తరఫు న్యాయవాది కౌంటర్లు దాఖలు చేశారు. ఆ పిటిషన్లపై వాదనలు వినడానికి న్యాయమూర్తి కేసును వాయిదా వేశారు. శ్రీవారి భక్తుల మనోభావాలు దెబ్బతినేలా, టీటీడీ పరువుకు భంగం కలిగేలా ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనంపై టీటీడీ వంద కోట్లకు పరువు నష్టం దావా దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును టీటీడీ తరపున రాజ్యసభ ఎంపీ సుబ్రమణ్యస్వామి వాదిస్తున్నారు.

బైక్ బోల్తా: వ్యక్తి మృతి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణారెడ్డి

పెళ్లకూరు: మోటారు బైక్ బోల్తా పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల తెలిపిన వివరాలు.. ఊడిపూడి గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు(30) నాయుడుపేట సమీపంలోని ఓ పరిశ్రమలో పని ముగించుకుని తిరిగి మోటారుబైక్‌లో ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యలో బంగారంపేట గ్రామ సమీపంలోని ప్రమాదకరంగా ఉన్న మలుపు వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడింది. ఘటనలో వెంకటేశ్వర్లు తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ కృష్ణారెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి భార్య అంకమ్మ, కుమార్తెలు బిందుశ్రీ, పూజిత ఉన్నారు.

మేయర్ హత్య కేసులో ఘటనాస్థలం పరిశీలన

చిత్తూరు అర్బన్: మేయర్ అనురాధ, ఆమె భర్త కటారి మోహన్ హత్య కేసులో డిఫెన్స్ న్యాయవాదులు బుధవారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఘటనాస్థలాన్ని పరిశీలించారు. శుక్రవారం నుంచి కోర్టులో ఈ కేసు విచారణకు రానున్న నేపథ్యంలో ప్రధాన నిందితుడు చింటూ తరపున వాదనలు వినిపించేందుకు న్యాయవాదులు అప్పటి హత్యాభియోగ ప్రాంతాలను పరిశీలించడం గమనార్హం.

భూతవాహనంపై భైరవుడు



తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్)/శ్రీకాళహస్తి: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవరోజు బుధవారం రాత్రి ముక్కంటీశుడు భూతవాహనంపై దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు అలంకార మండపంలో ప్రత్యేక పూజలు చేపట్టి, ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం కళాకారుల ఆటపాటలు, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఉభయదారులు ముందు నడవగా స్వామి, అమ్మవార్లను నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర నీరాజనాలతో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు, ఈఓ కేవీ సాగర్‌బాబు, పాలకమండలి సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

భూతనాథుడిగా నీలకంఠుడు..

భూతనాథుడైన శ్రీకాళహస్తీశ్వరుడు బుధవారం రాత్రి భూత వాహనంపై, అమ్మవారు శుక (చిలుక) వాహనంపై అభయప్రదానం చేశారు. రాజగోపురం గుండా తేరువీధిలోకి స్వామి, అమ్మవారు ప్రవేశించారు. శివనామస్మరణలతో, భక్తుల ఢమరుక నాదాలతో మాడవీధులు మార్మోగాయి. విద్యుత్‌దీపాల వెలుగులు, కళాకారుల ఆటపాటలతో స్వామి, అమ్మవారి ఊరేగింపు ఉత్సవాన్ని భక్తులు తిలకించారు. అంతకుముందు ఉదయం సూర్యప్రభపై కైలాసనాథుడు, చప్పరంపై నుంచి జ్ఞానప్రసునాంబ అమ్మవారు భక్తులను కటాక్షించారు.

నేడు గాంధర్వరాత్రి సందర్భంగా ఉదయం స్వామి, అమ్మవార్లు హంస, యాళి, రాత్రి రావణుడు, మయూర వాహనాలపై ఊరేగనున్నారు.